క్లుప్తంగా

అక్రమంగా తెల్లరాయి తరలింపు

• తహసీల్దార్‌కు ఫిర్యాదు



నందివాయలో అక్రమంగా తరలించేందుకు సిద్ధంగా ఉన్న తెల్లరాయి

పొదలకూరు: మండలంలోని నందివాయ గ్రామం నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా తెల్లరాయిని తరలిస్తున్నట్లు గ్రామస్తులు తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. గ్రామంలో చాలా ఏళ్లుగా మైనింగ్ నిర్వహిస్తున్నారు. వివిధ కారణాల వల్ల ప్రస్తుతం మైనింగ్ నిలిచిపోయినప్పటికీ గ్రామానికి చెందిన కొందరు మైనింగ్ నుంచి రాయిని మరో ప్రాంతానికి తోలుకుని కూలీల చేత కొట్టిస్తూ అనుమతులు లేకుండా బయటి ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఈ తంతు కొంతకాలంగా జరుగుతున్నా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లారు. ఇదే పద్ధతిలో మండలంలోని పలు చోట్ల తెల్లరాయి, క్వార్ట్జ్, పలాస్పర్ వంటి ఖనిజాలను కూలీల ద్వారా కొట్టించి తరలిస్తున్నారు. ఫలితంగా మైనింగ్ శాఖ రాయిల్టీ కోల్పోవాల్సి వస్తోంది.

ప్రమాదాల నివారణ అందరి బాధ్యత



మాట్లాడుతున్న పూర్ణచంద్రరావు

నెల్లూరు(క్రైమ్): రోడ్డు ప్రమాదాల నివారణ అందరి బాధ్యత అని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ పూర్ణచంద్రరావు పేర్కొన్నారు. ఆర్టీసీ నెల్లూరు ఒకటో డిపో గ్యారేజీలో రోడ్డు భద్రత వారోత్సవాలను శుక్రవారం ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. అధిక శాతం ప్రమాదాలు మానవ తప్పిదాలతోనే జరుగుతున్నాయని చెప్పారు. వాహనాల్లో వస్తున్న మార్పులకు అనుగుణంగా డ్రైవర్లు శిక్షణ పొందాలని కోరారు. డిపో మేనేజర్ మురళీకృష్ణ పాల్గొన్నారు.

• రీజియన్లోని ఏడు డిపోల్లో రోడ్డు భద్రత వారోత్సవాలను ఫిబ్రవరి రెండు వరకు నిర్వహించనున్నామని జిల్లా ప్రజారవాణాధికారి శేషయ్య పేర్కొన్నారు. ప్రమాద రహిత డ్రైవర్లను గుర్తించి సురక్షితమైన డ్రైవింగ్ మెళకువలను నేర్పించడంతో పాటు ఇతర అంశాలపై కౌన్సెలింగ్‌ను ఇవ్వనున్నామని చెప్పారు. ప్రమాద రహిత సర్వీస్ డ్రైవర్లను గుర్తించి వారికి ప్రశంసపత్రాలు, నగదు ప్రోత్సాహకాలను అందజేయనున్నామని వెల్లడించారు.

ఆరోగ్యశ్రీ వార్డుల్లో ఆకస్మిక తనిఖీలు

నెల్లూరు(అర్బన్): ఆరోగ్యశ్రీ ద్వారా అందుతున్న సేవలపై వైఎస్సార్ ఆరోగ్యశ్రీ రాష్ట్ర స్పెషలాఫీసర్ డాక్టర్ అశోక్‌బాబు జిల్లా కోఆర్డినేటర్ చంద్రశేఖర్ ఆకస్మిక తనిఖీలను శుక్రవారం చేపట్టారు. ఆరోగ్యశ్రీ ఉన్న కొన్ని ఆస్పత్రులపై ఆరోపణలొస్తున్న నేపథ్యంలో తనిఖీలను నిర్వహించారు. పొగతోటలోని రిచ్ ఆస్పత్రిలో గల ఆరోగ్యశ్రీ వార్డుల్లో ఉన్న రోగులకు అందుతున్న వైద్య సేవలను ఆరాతీశారు. అనంతరం దర్గామిట్టలోని ప్రభుత్వ పెద్దాస్పత్రిలో ఆరోగ్యశ్రీ వార్డులో ఉన్న రోగులతో మాట్లాడారు. ఆరోగ్యశ్రీ వార్డులకు సంబంధించిన వైద్యులకు సూచనలు చేశారు.

సాయి సూక్తి పుస్తకావిష్కరణ



నెల్లూరు రూరల్: జెడ్పీ వాకర్స్ అసోసియేషన్ సభ్యుడు రమణమూర్తి రచించిన సాయి సూక్తి పుస్తకాన్ని పొదలకూరు రోడ్డులోని జెడ్పీ హైస్కూల్ ఆవరణలో శుక్రవారం ఆవిష్కరించారు. వాకర్స్ డిప్యూటీ గవర్నర్ సుధాకర్‌రెడ్డి, విశ్రాంత జైలు సూపరింటెండెంట్ ఆనంతరావు, రాజగోపాల్, కృష్ణయ్య, బాలసుబ్రహ్మణ్యం, ప్రసాద్, ఖాసిం, తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు సంక్షేమ పథకాలు



నెల్లూరు సిటీ: అర్హులకు సంక్షేమ పథకాలు అందేలా వార్డు సచివాలయ కార్యదర్శులు చర్యలు చేపట్టాలని కమిషనర్ హరిత పేర్కొన్నారు. 41వ డివిజన్లోని మూలాపేటలో గల సచివాలయాన్ని శుక్రవారం పరిశీలించిన అనంతరం ఆమె మాట్లాడారు. ఆస్తి పన్నులు, యూజర్ చార్జీలను వేగవంతంగా వసూలు చేయాలని చెప్పారు. సచివాలయ కార్యదర్శులు ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలను అందించాలని సూచించారు. జగనన్న భూ హక్కు పథకంలో భాగంగా రీ సర్వేను వెంటనే ప్రారంభించాలని ఆదేశించారు.

ప్రజల ఆనందమే వైఎస్సార్‌సీపీకి ఆశీస్సులు

• కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి



యల్లాయపాళెంలో సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

కొడవలూరు: ప్రతి ఇంట్లో కన్పిస్తున్న ప్రజల ఆనందమే వైఎస్సార్‌సీపీకి ఆశీస్సులని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి అన్నారు. మండలంలోని యల్లాయపాళెంలో శుక్రవారం 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రతి ఇంటికీ వెళ్లి సంక్షేమ పథకాలు బుక్‌లెట్ అందజేసి స్థానిక సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇప్పటివరకు కోవూరు నియోజకవర్గంలోని 50 సచివాలయాల పరిధిలో 56,158 గడపలకు వెళ్లి ప్రజలతో మమేకమయ్యామని తెలిపారు. కొడవలూరు మండలంలోనే సంక్షేమ పథకాల ద్వారా రూ.173.82 కోట్లు లబ్ధిదారులకు అందినట్లు తెలిపారు. ఏ గడపకు వెళ్లినా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కులమతాలు, పార్టీలకు అతీతంగా తమకు సంక్షేమ పథకాలు అందించారని ఆనందంగా చెబుతున్నారని తెలిపారు. 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యేలను ప్రతి ఇంటికి పంపడం ఒక మహత్తర కార్యక్రమమని పేర్కొన్నారు. ఎమ్మెల్యేతోపాటు అన్ని శాఖల అధికారులు అందుబాటులో ఉండి సమస్యలను అక్కడికక్కడే పరిష్కరిస్తుండడం ప్రజల మనస్సుల్లో నిలిచిపోతోందన్నారు. ఈ సందర్భంగా యల్లాయపాళెం ఉన్నత పాఠశాలలో 'మనబడి నాడు – నేడు' కార్యక్రమంలో భాగంగా రూ.40.92 లక్షలతో ఆధునికీకరణ పనులు పూర్తి కాగా ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం గ్రామంలోని స్వయం సహాయక సంఘాలకు బ్యాంక్ లింకేజి, స్త్రీనిధి ద్వారా మంజూరైన రూ.1.51 కోట్ల రుణాల చెక్కులను ఎమ్మెల్యే లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో డీసీఎమ్మెస్ చైర్మన్ వీరి చలపతిరావు, తహసీల్దార్, ఎంపీడీఓలు రమాదేవి, సుబ్రహ్మణ్యం, ఎంఈఓ, ఏపీఎం వసంతకుమారి, రుక్మిణి, హెచ్ఎం లక్ష్మీప్రసూన, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గంధం వెంకటశేషయ్య, నాయకులు ఇసనాక సునీల్‌రెడ్డి, దేవిరెడ్డి సాయిరెడ్డి, తాటిపర్తి భాస్కర్, కేతిరెడ్డి వెంకటరమణారెడ్డి, మల్లి కిషోర్‌రెడ్డి, ఎస్‌కే మాబాషా, టి.ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నాటుసారా రహిత గ్రామాలుగా గుర్తింపు

• ఏఈఎస్ కృష్ణకిషోర్‌రెడ్డి



మాట్లాడుతున్న ఏఈఎస్ కృష్ణకిషోర్‌రెడ్డి

పొదలకూరు: నాటుసారా రహిత గ్రామాలుగా మండలంలోని బిరదవోలు, బ్రాహ్మణపల్లి గ్రామాలను ఎస్ఈబీ గుర్తించినట్లు ఆ గ్రామాలను దత్తత తీసుకున్న నెల్లూరు ఏఈఎస్ కృష్ణకిషోర్‌రెడ్డి తెలిపారు. బిరదవోలు సచివాలయం, బ్రాహ్మణపల్లి పాఠశాలలో శుక్రవారం గ్రామస్తులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్ఈబీ జేడీ శ్రీలక్ష్మి ఆదేశాల మేరకు రెండు గ్రామాలను దత్తత తీసుకుని గ్రామస్తులకు నాటుసారా వల్ల కలిగే నష్టాలను వివరించినట్లు తెలిపారు. స్థానిక పోలీసులు, సచివాలయ ఉద్యోగులు, పొదుపు సంఘాల మహిళలు, వీఓఏలు, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు, ఉపాధ్యాయులు, స్వచ్ఛంద సంస్థల సహకారం కూడా తీసుకున్నట్లు తెలిపారు. ఫలితంగా ఈ రెండు పల్లెలు నాటుసారా రహిత గ్రామాలుగా మారాయన్నారు. తరచూ అవగాహన సదస్సులు నిర్వహించడం వల్ల సత్ఫలితాలు వచ్చాయని తెలిపారు. మరలా నాటుసారా తయారు చేస్తున్నట్లు సమాచారం ఉంటే వెంటనే 14500 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు. సదస్సులో సీఐలు వెంకటేశ్వరరావు, శ్రీనివాసులు, ఎస్సై ప్రభాకర్‌రావు, సర్పంచ్ వెంకటరమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ట ఉత్సవాలు



వల్లూరులో నిర్మించిన శివసాయిబాబా ఆలయం

ముత్తుకూరు: మండలంలోని వల్లూరులో రూ.60 లక్షలతో నిర్మించిన నూతన శ్రీశివసాయిబాబా ఆలయంలో విగ్రహ ప్రతిష్ట ఉత్సవాలు శుక్రవారం వైభవంగా జరిగాయి. వేదపండితుల మంత్రోచ్చారణలు, మేళతాళాలు, హోమ పూజల నడుమ శ్రీషిరిడి సాయిబాబా, విఘ్నేశ్వరస్వామి, దత్తాత్రేయ స్వామి, మురళీకృష్ణస్వామి, నంది సాయి పాదుకలు, విమాన శిఖర విగ్రహాల ప్రతిష్ట కార్యక్రమంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. నిర్వాహకులు వల్లూరు మోహనరావు – హైమావతమ్మ పర్యవేక్షణలో జరిగిన ఈ వేడుకల్లో పరిసర గ్రామాల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని బాబాని దర్శనం చేసుకొన్నారు. అనంతరం వేదపండితులు మహాకుంభాభిషేకం నిర్వహించారు. పేదలకు అన్నదానం చేశారు. వైఎస్సార్‌సీపీ నేత దువ్వూరు చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు సేవా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

పెట్టుబడులకు దేశ ఆర్థిక వ్యవస్థ మంచి వేదిక

• వీఎస్‌యూ వైస్ చాన్సలర్ జీఎం సుందరవల్లి



మాట్లాడుతున్న వైస్ చాన్సలర్ జీఎం సుందరవల్లి

వెంకటాచలం: ప్రపంచ దేశాల్లో భారతదేశ ఆర్థిక వ్యవస్థ పెట్టుబడులకు మంచి వేదిక అని విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ జీఎం సుందరవల్లి అన్నారు. మండలంలోని కాకుటూరు వద్దనున్న వీఎస్‌యూలో శుక్రవారం 'ఫైనాన్షియల్ ఎడ్యుకేషన్ ఆన్ ఇండియన్ సెక్యూరిటీ మార్కెట్' అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో వైస్ చాన్సలర్ మాట్లాడుతూ వివిధ అంశాలపై నిర్వహించే సదస్సుల్లో విద్యార్థినీ, విద్యార్థులు తప్పనిసరిగా పాల్గొని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వీఎస్‌యూ ప్లేస్‌మెంట్ కెరీర్ కౌన్సిల్ విభాగం ఆధ్వర్యంలో ఈ సదస్సు నిర్వహించడం విద్యార్థులకు చక్కని అవకాశమన్నారు. సదస్సులో పలువురు ప్రముఖులు స్టాక్ మార్కెట్‌లో ఏ విధంగా పెట్టుబడులు పెట్టాలో వివరించారు. సదస్సులో రిజిస్ట్రార్ డాక్టర్ పి.రామచంద్రారెడ్డి, ప్లేస్‌మెంట్ అండ్ కెరీర్ కౌన్సిల్ సెక్రటరీ స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

2 నుంచి గ్రిగ్ మెమోరియల్ ఆటల పోటీలు

• పోస్టర్ ఆవిష్కరించిన ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి



గ్రిగ్ పోటీల పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

కొడవలూరు: ఇందుకూరుపేట మండలం నరసాపురం ఎంవీఆర్ఆర్ జెడ్పీ హైస్కూల్‌లో వచ్చే నెల 2, 3, 4 తేదీల్లో 98వ గ్రిగ్ మెమోరియల్ నియోజకవర్గ స్థాయి ఆటల పోటీలు జరగనున్నాయి. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను కొడవలూరు మండలం యల్లాయపాళెంలో కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గ్రిగ్ మెమోరియల్ ఆటల పోటీల కార్యనిర్వాహక కార్యదర్శి టి.పల్లవి మాట్లాడుతూ ఈ పోటీలను అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పోటీల్లో నియోజకవర్గంలోని అన్ని ఉన్నత పాఠశాలల నుంచి క్రీడాకారులు పాల్గొంటారని తెలిపారు. ఈ పోటీలకు నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి పూర్తి ఆర్థిక సహకారం అందిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు దువ్వూరు కల్యాణ్‌రెడ్డి, డీఎల్‌డీఏ చైర్మన్ గొల్లపల్లి విజయకుమార్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మావులూరు శ్రీనివాసులురెడ్డి, పీడీలు ఎస్‌కే ముజీర్, జ్యోతి, అరొరా, సందర్‌బాబు, శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాపూరు – పొదలకూరు రోడ్డు పనులు

• మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి చొరవ



రోడ్డు మరమ్మతు పనులు చేస్తున్న దృశ్యం

పొదలకూరు: ఇటీవల వర్షాలకు దెబ్బతిన్న రాపూరు – పొదలకూరు రోడ్డు పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఈ రోడ్డు పలుచోట్ల గుంతలమయంగా మారడంతో గతంలో మరమ్మతులు చేపట్టారు. అయితే తుపాను ప్రభావం వల్ల భారీ వర్షాలు కురిసి మరలా రోడ్డు దెబ్బతింది. దీంతో రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి చొరవ తీసుకుని యుద్ధప్రాతిపదికన తిరిగి రివిజన్ రోడ్డును వేయిస్తున్నారు. మొత్తం 3 కి.మీ. నిడివి వరకు(డేగపూడి వరకు) రోడ్డు పనులను చేపడుతున్నారు. రహదారుల ఆధునికీకరణ కింద నెల్లూరు వయా పొదలకూరు మీదుగా డేగపూడి వరకు నిధులు మంజూరయ్యాయి. అయితే అత్యవసరంగా ముందుగా 3 కి.మీ. దూరం ఉన్న రోడ్డు పనులను పూర్తి చేయిస్తున్నారు. మిగిలిన రోడ్డు పనులను ప్రారంభించేందుకు ఆర్అండ్‌బీ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. రాపూరు – పొదలకూరు రోడ్డు మర్రిపల్లి నుంచి డేగపూడి వరకు బాగా దెబ్బతినడంతో వర్షాలు తగ్గిన తర్వాత అత్యవసరంగా పనులు చేపట్టి పూర్తి చేయిస్తున్నట్లు ఆర్అండ్‌బీ అధికారులు తెలిపారు.

నేడు బద్దెవోలులో 'గడప గడపకు..'

మనుబోలు: మండలంలోని బద్దెవోలు గ్రామంలో శనివారం రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ వెంకటేశ్వర్లు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 4 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందని తెలిపారు.

తహసీల్దార్ ఎదుట బైండోవర్

ఇందుకూరుపేట(విడవలూరు): మద్యం బాటిళ్ల అక్రమ రవాణా కేసులో నిందితుడిగా ఉన్న కొమరి బాబును శుక్రవారం కోవూరు ఎస్ఈబీ అధికారులు తహసీల్దార్ చంద్రశేఖర్ ఎదుట బైండోవర్ చేశారు. ఈ సందర్భంగా ఎస్ఈబీ ఎస్సై నరహరి మాట్లాడుతూ మండలంలోని పొన్నపూడి గ్రామానికి చెందిన పొన్నపూడి బాబు 2021 సెప్టెంబర్‌లో 96 కర్ణాటక మద్యం బాటిళ్లను తరలిస్తూ పట్టుబడ్డాడని తెలిపారు. ఈ మేరకు ఏడాదిపాటు రూ.2 లక్షల పూచీకత్తుపై బైండోవర్ చేశామన్నారు. మండలంలో ఎక్కడైనా నాటుసారా తయారు చేస్తున్నా, గంజాయి విక్రయిస్తున్నా 14500 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు. ఆయన వెంట ఎస్ఈబీ సిబ్బంది ఉన్నారు.

షుగర్ ఫ్యాక్టరీలో సినిమా షూటింగ్

కోవూరు: స్థానిక షుగర్ ఫ్యాక్టరీలో శుక్రవారం 'దొంగ దొంగలు' అనే సినిమా షూటింగ్ ప్రారంభమైంది. ఈ షూటింగ్ నాలుగు రోజులపాటు జరుగుతుందని ఎగ్జిక్యూటివ్ పాపిశెట్టి చిరంజీవి, రాజనాల శివసందీప్ తెలిపారు. ఈ సినిమాలో కేరాఫ్ కంచరపాళెంలో ఫేమ్ కేశవ, పుష్ప–2లో విలన్ పాత్ర పోషించిన రాజరాయులు, విశ్వనాథ్ నటిస్తున్నారని తెలిపారు. ఈ సినిమాను నెల్లూరు పరిసర ప్రాంతాల్లో చిత్రీకరించనున్నట్లు తెలిపారు.

తెగుళ్ల నివారణపై రైతులకు శిక్షణ



మాట్లాడుతున్న డీడీఏ శివనారాయణ

కొడవలూరు(విడవలూరు): వరి పంటను ఆశించే తెగుళ్ల నివారణపై విడవలూరులోని రైతుభరోసా కేంద్రంలో శుక్రవారం రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రైతు శిక్షణా కేంద్రం డీడీఏ జి.శివనారాయణ, నెల్లూరు ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త సురేఖాదేవి, రైతు శిక్షణా కేంద్రం ఏడీఏ వీవీ శిరీష హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వరి పంటను ఆశించే పురుగులు, తెగుళ్లు, వాటి నివారణ చర్యలపై రైతులకు వివరించారు.

భూవివాదాలకు రీ సర్వేతో పరిష్కారం



డ్రోన్ సర్వేను పర్యవేక్షిస్తున్న తహసీల్దార్ చంద్రశేఖర్

ఇందుకూరుపేట(విడవలూరు): వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు – భూరక్ష పథకం ద్వారా చేపట్టే భూముల రీ సర్వేతో భూవివాదాలకు పరిష్కారం లభిస్తోందని తహసీల్దార్ చంద్రశేఖర్ తెలిపారు. విడవలూరులో శుక్రవారం డ్రోన్ సహాయంతో రీ సర్వే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ భూసమస్యల పరిష్కారానికి రాష్ట్రం ప్రభుత్వం రీ సర్వే కార్యక్రమాన్ని అమలు చేస్తోందని, తద్వారా అసలైన భూ హక్కుదారులను గుర్తించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్రవీణ్, నాయకులు కాటంరెడ్డి నవీన్‌కుమార్‌రెడ్డి, పూండ్ల అచ్యుత్‌రెడ్డి, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

ముదిగేడులో వైద్యశిబిరం



వృద్ధురాలికి పరీక్షలు చేస్తున్న డాక్టర్ రమేష్

పొదలకూరు: మండలంలోని ముదిగేడు గ్రామంలో జ్వరాల తీవ్రతను దృష్టిలో ఉంచుకుని మహ్మదాపురం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ రమేష్ శుక్రవారం గ్రామంలో ప్రత్యేక వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ఫీవర్ సర్వే నిర్వహించి జ్వరాలు ఉన్న వారికి పరీక్షలు చేసి మందులు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ రమేష్ మాట్లాడుతూ గ్రామస్తులు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఇళ్లలో చెత్తాచెదారాన్ని నిల్వ చేయకుండా తొలగించుకోవాలన్నారు. ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలని, రోడ్లపై మురుగునీరు నిల్వ లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ప్రస్తుతం నలుగురికి మాత్రమే సాధారణ జ్వరాలు ఉన్నాయని తెలిపారు. ఆయన వెంట ఎస్‌యూఓ ఆంజనేయవర్మ, ఎంపీహెచ్ఓ రవికుమార్, ఆరోగ్య సహాయకురాలు మేరీ, ఎంఎల్‌హెచ్‌పీ రఫీ, ఆశా కార్యకర్తలు ఉన్నారు.

భగవత్ సంకల్పంతోనే దేవస్థానం నిర్మాణం



కల్యాణ మండపాన్ని ప్రారంభిస్తున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

• రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

పొదలకూరు: భగవత్ సంకల్పంతోనే స్థానిక అయ్యప్పనగర్‌లో శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వెంకటేశ్వస్వామి దేవస్థానం నిర్మించారని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆ ఆలయంలో అత్యంత వైభవంగా స్వామి, అమ్మవార్ల విగ్రహ ప్రతిష్ట మహోత్సవం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి హాజరై ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి దేవస్థానం కల్యాణ మండపాన్ని ప్రారంభించారు. ఆలయ నిర్మాణానికి రమణయ్య, మాలకొండారెడ్డి కృషి చేసినట్లు తెలిపారు. దేవస్థానంలో కల్యాణ మండపం నిర్మించుకునేందుకు పంచాయతీ ద్వారా నిధులు సమకూర్చినట్లు తెలిపారు. మంత్రి వెంట ఆలయ కమిటీ చైర్మన్ బోయిళ్ల మాలకొండారెడ్డి, సభ్యులు అల్లూరు రమణయ్య, మోహన్‌రావు, కండే వాసుదేవరావు, వైస్ ఎంపీపీ వేణుంబాక చంద్రశేఖర్‌రెడ్డి, ఉప సర్పంచ్ వాకాటి శ్రీనివాసులురెడ్డి, కోనం చినబ్రహ్మయ్య, సొసైటీ డైరెక్టర్ గోగుల గోపాలయ్య, కె.అంకిరెడ్డి తదితరులు ఉన్నారు.

వైభవంగా కల్యాణోత్సవం

శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వెంకటేశ్వస్వామి దేవస్థానంలో విగ్రహ ప్రతిష్ట ఉత్సవాలు పూర్తయిన సందర్భంగా నూతనంగా నిర్మించిన కల్యాణ మండపంలో స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్చారణలు, మంగళ వాయిద్యాల నడుమ శ్రీవారి కల్యాణం కనులపండువగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. భక్తులకు నిర్వాహకులు అన్నప్రసాదాలను ఏర్పాటు చేశారు.

ప్రారంభోత్సవాలు

పొదలకూరు: మండలంలోని దుగ్గుంట సచివాలయం పరిధిలోని కోనచెరువు(గిరిజనకాలనీ)లో రూ.10 లక్షలతో నిర్మించిన సైడ్ డ్రెయిన్లను శుక్రవారం మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెట్టప్రాంతానికి సాగునీటిని సాజావుగా అందిస్తున్నట్లు తెలిపారు. కండలేరు ఒకటో నంబర్ బ్రాంచ్ కాలువ ద్వారా పెదరాజుపాళెం, కొనగలూరు, రామాపురం, దుగ్గుంట గ్రామాలకు సాగునీటిని అందిస్తున్నట్లు తెలిపారు. సాగునీరు అందని గ్రామాలకు త్వరలో అందిస్తామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ప్రసాద్, ఎంపీడీఓ నగేష్‌కుమారి, విద్యుత్ ఏడీఈ సురేంద్రబాబు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కిసనానాయక్, సొసైటీ చైర్మన్ గోగిరెడ్డి గోపాల్‌రెడ్డి, ఎంపీపీ సుబ్బారాయుడు, వైస్ ఎంపీపీ వేణుంబాక చంద్రశేఖర్‌రెడ్డి, సచివాలయాల మండల కన్వీనర్ బచ్చల సురేష్‌కుమార్‌రెడ్డి, సర్పంచ్ వెంకటరమణయ్య, ఎంపీటీసీ సభ్యుడు కేతు రామిరెడ్డి, నాయకులు సుందరయ్య, మోహన్‌రాజు, జనార్దన్, డేగా రమణయ్య, డేగా జయరామయ్య, బాలకోటి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కల్యాణ వెంకటేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ట



మూలమూర్తులకు ప్రత్యేక పూజలు చేస్తున్న వేదపండితులు

పొదలకూరు: పట్టణంలోని అయ్యప్పనగర్‌లో నిర్మించిన శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం స్వామి, అమ్మవార్ల విగ్రహ ప్రతిష్ట ఉత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించారు. భువనేశ్వరీ పీఠాధిపతి కమలానంద భారతిస్వామిజీ ఆధ్వర్యంలో 20 మంది అర్చకుల బృందం తెల్లవారుజామున 5.15 గంటలకు వేదమంత్రాల నడుమ స్వామి, అమ్మవార్ల విగ్రహాలను ప్రతిష్టించారు. గోపుర కలశాలకు శాస్త్రోక్తంగా కుంభాభిషేకం నిర్వహించారు. గత ఐదు రోజులుగా విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు జరుగుతున్నాయి. ఈ ఉత్సవాల సందర్భంగా గోవింద నామస్మరణతో పొదలకూరు పట్టణం మార్మోగింది. విద్యుద్దీపాల అలంకరణలతో ఆలయం వెలిగిపోయింది. సాయంత్రం 6 గంటలకు స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవం కనులపండువగా నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమాల్లో ఆలయ కమిటీ చైర్మన్ బోయిళ్ల మాలకొండారెడ్డి, సభ్యులు అల్లూరు రమణయ్య, జి.మోహన్‌రావు, కండే వాసుదేవరావు, వలంటీర్లు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

ఇందుకూరుపేట: గృహసారథులు వైఎస్సార్‌సీపీ బలోపేతానికి శక్తివంచన లేకుండా కృషి చేయాలని సచివాలయ మండల కన్వీనర్ బీవీ రమణయ్య అన్నారు. మండలంలోని రావూరు, కొమరిక, ముదివర్తిపాళెం, కుడితిపాళెం గ్రామాల్లో శుక్రవారం నూతనంగా గృహసారథుల నియామకం చేపట్టారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి గడపకు తీసుకెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ వెంకటశేషయ్య, దిల్షాద్, ముంగర శ్రీకాంత్, కొండలరావు తదితరులు పాల్గొన్నారు.